క్లుప్తంగా

కొనసాగుతున్న క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ ఇంటర్వ్యూల సందర్భంగా పరీక్ష రాస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. తొలి రోజు రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మంగళవారం కల్పతరు ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ చేపట్టింది. అనంతపురం, ఉరవకొండ, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, కళ్యాణదుర్గం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొత్తం 92 మంది పాల్గొన్నారు. తొలుత రాత పరీక్షను నిర్వహించగా 64 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. తుది రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసరావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ధీరేంద్రబాబు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు పుష్పావతి

అనంతపురం: మద్యం మత్తులో కుటుంబ పోషణను నిర్లక్ష్యం చేసిన భర్త వైఖరితో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌లో నివాసముంటున్న పుష్పావతి (32), రామాంజనేయులు దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెయింటింగ్ పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్న రామాంజనేయులు కొన్ని నెలలుగా మద్యానికి బానిసై, జులాయిగా మారాడు. కుటుంబ పోషణను పూర్తిగా విస్మరించాడు. దీంతో తాగుడు మానేసి, కుటుంబ పోషణపై దృష్టి పెట్టాలని మంగళవారం ఉదయం భార్య హితవు పలికింది. ఇది రుచించని రామాంజనేయులు ఆమెతో ఘర్షణ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మనస్తాపం చెందిన పుష్పావతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నగరం.. జీవన సమరం

శ్రమజీవుల బతుకు పోరు ముందు చలి తలవంచింది. అనంతపురం నగరంలో అర్ధరాత్రి సమయాన పారిశుధ్య కార్మికులు రహదారులు శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. హమాలీలు, వ్యాపారులతో కాయగూరలు, ఆకుకూరల మార్కెట్‌లో సందడి నెలకొంది. రైల్వే ఫీడర్ రోడ్డులో సక్రమంగా పనిచేయని సీసీ కెమెరాలకు సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపట్టారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకూ ఈ దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అర్ధరాత్రి 12 గంటల సమయంలో టవర్ క్లాక్ సెంటర్









చలిలోనే రోడ్డు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు, అర్ధరాత్రి సీసీ కెమెరాను మరమ్మతు చేస్తున్న దృశ్యం,తెల్లవారుజాము 4 గంటలకే పాతూరు మార్కెట్‌లో సందడి, రాత్రి టీ కొట్టు వద్ద ఇలా..

డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయండి



ఈఈ రాధాకృష్ణకు సూచనలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని మేయర్ వసీం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి మేయర్ వసీం నగరంలోని 43, 46వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మేయర్ మాట్లాడారు. కాలువలు లేకపోవడంతో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన డివిజన్లలోని వివిధ ప్రాంతాల్లో కాలవ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పారిశుద్ధ్యం మెరుగునకు ప్రాధాన్యత

నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మేయర్ ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. కార్పొరేటర్లు ఇసాక్, రాజేశ్వరి, సైఫుల్లాబేగ్, అబూసలేహా, ఈఈ రాధాకృష్ణ, డీఈ నరసింహ, ఏఈ రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దాదాఖలందర్, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం ద్రోహం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర దోహం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ధ్వజమెత్తారు. మోదీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను స్థాపిస్తామని పదేళ్లుగా చెప్పిన బీజేపీ ఇప్పుడు కడప ఉక్క పరిశీలనలో లేదని చేతులెత్తేసిందన్నారు. ఆంధ్రులు హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడం ఆంధ్రులను అగౌరవపర్చడమే అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల సాయంతో కేంద్రంలో అధికారంలో ఉండి కూడా రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై పూటకోమాట మార్చి రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిందన్నారు. నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రి, వెంట నారాయణ, గోపాల్, ముత్తూజ, రామాంజినమ్మ, ప్రకాష్, వలి, రామాంజినేయులు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ జెమినీ ప్రసాద్ దేహదానం



జెమినీ ప్రసాద్ పార్థివదేహాన్ని స్వీకరిస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు



ప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

అనంతపురం మెడికల్: ఆరు దశాబ్దాల పాటు కలం పోరాటంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్ట్ నందినేని దేవప్రసాద్ అలియాస్ జెమినీ ప్రసాద్ మృతి అనంతరం ఆయన పార్థివదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ నెల 6న ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతపురంలోని ప్రెస్ క్లబ్ నుంచి భారీ ర్యాలీగా బోధనాస్పత్రికి ఆయన పార్థివదేహాన్ని జర్నలిస్టులు తరలించి ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు అప్పగించారు. కళాశాలలోని అనాటమీ డిపార్ట్‌మెంట్‌లో ఆయన శరీరాన్ని భద్రపరిచారు. అన్ని దానాల్లోకెల్లా దేహదానం చాలా గొప్పదని, ఎంతో మంచి మనసు ఉంటే తప్ప అంత గొప్ప పని చేయడం సాధ్యం కాదని ఈ సందర్భంగా డాక్టర్ మాణిక్యరావు కొనియాడారు. మానవ అంతర్ నిర్మాణ శాస్త్ర అధ్యయనానికి దేహదానం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, చల్లా నాయుడు, తలారి రామాంజినేయులు, నాగభూషణం, విశ్వనాథ్, సుధాకర్, చంద్ర, రామాంజినేయులు, శ్రీరాములు, నాగభూషణం, బోగేశ్వరరెడ్డి, నందుటైమ్స్ భాస్కరరెడ్డి, రామలింగారెడ్డి, మంజునాథ్, శ్రీనివాసరెడ్డి, 150 మందికిపైగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ప్రసాద్ మృతి తీరనిలోటు

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: జర్నలిస్టు ప్రసాద్ మృతి తీరనిలోటని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు ప్రసాద్ భౌతికకాయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వతోపాటు రాప్తాడు, రాయదుర్గం ఎమ్మెల్యేలు పరిటాల సునిత, కాలవ శ్రీనివాసులు, నాయకులు పరిటాల శ్రీరామ్, జగదీష్, కేవీ రమణ, సీపీ వీరన్న, వేమయ్య యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి ప్రసాద్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రసాద్ కాలేజీ రోజుల నుంచి తనకు పరిచయం ఉందన్నారు. ప్రసాద్‌కు తమ సోదరుడు, జర్నలిస్టు తిమ్మారెడ్డికి దగ్గర మిత్రుడన్నారు. ప్రెస్‌క్లబ్ నిర్వహణలో చాలా చురుగా వ్యవహరించారన్నారు. చాలా నిజాయితీ పరుడని, నేటి తరం జర్నలిస్టులు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం ప్రసాద్ భౌతికకాయాన్ని ప్రెస్‌క్లబ్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ నుంచి మెడికల్ కళాశాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి సాంబశివారెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, పెన్నోబులేసు మర్యాదపూర్వకంగా కలిశారు.

'ఎస్వీ' విద్యార్థి ఘనత



విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.యశ్వంత్‌రెడ్డి అరుదైన ఘనత సాధించాడు. వినూత్న ఆలోచనలతో తాను రూపొందించిన 'ధన్విన్ ఎకో వుడ్స్ స్టార్టప్'కు అమెరికాకు చెందిన బ్లూప్లాట్ వెంచర్స్ ఎల్ఎల్‌సీ సంస్థ దన్నుగా నిలిచింది. రూ. 45 లక్షలు పెట్టుబడి ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. వివరాలను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి వెల్లడించారు. విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందించారు. 2023లో ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టార్టప్ జాతర'లో పాల్గొన్న యశ్వంత్‌రెడ్డి రూపొందించిన ప్రాజెక్ట్ 'బెస్ట్ స్టార్టప్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచిందన్నారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం ద్వారా రూ. 5 లక్షలు పెట్టుబడి పొందాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్‌భట్, కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ ఎస్.రిజ్వానా, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తే పుట్టగతులుండవు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

అనంతపురం అర్బన్: ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా కేవలం ప్రజల కోసమే వ్యవసాయం చేస్తున్న రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే పుట్టగతులుండవని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములుతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్నదాతలను దగా చేసిన కూటమి సర్కార్ తీరును నిరసించారు. ఈ ఏడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వంద మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడం దారుణమన్నారు. డీసీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికలకు ముందు కౌలు రైతుల కుటుంబాలను పరామర్శించి సొంత నిధులతో ఆర్థిక సహాయం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆత్మహత్య చేసుకున్న రైతుల గురించి కానీ, వాటి నివారణపై కనీసంగానూ ప్రస్తావించకపోవడం చూస్తే... ఆయన వాస్తవ నైజం ఏమిటనేది బయటపడిందన్నారు. ఉచిత పంటల బీమా పథకానికి సమాధి కట్టి రైతులపై ప్రీమియం భారాన్ని మోపడం వారిని మోసగించడమేనన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలతో పాటు పంట నష్టానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



ఆపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: పేద, మధ్య వర్గాల పిల్లలు ఎక్కువగా చదువుకుంటున్న ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వేర్వేరు కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్), రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్జేయూపీ) క్యాలెండర్లను డీఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పని చేసి పిల్లలను పోటీ తత్వానికి తగ్గట్టు తీర్చిదిద్దాలన్నారు. డీఈఓ కార్యాలయ ఏడీ కృష్ణయ్య, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, ఆపస్ నాయకులు వెంకటేశ్వరప్రసాద్, రాజేంద్రప్రసాద్, నారాయణస్వామి, కళ్యాణి, ఎర్రిస్వామి, మంజుశ్రీ, పీఎస్పీ నాయుడు, ఆర్జేయూపీ నాయకులు రామాంజనేయులు, రామానాయుడు పాల్గొన్నారు.

వారు చెప్పిన వారే అధ్యక్షులు!

- 'తమ్ముళ్ల' కనుసన్నల్లో గొర్రెల పెంపకదారుల సొసైటీ ఎన్నికలు
- సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆత్మకూరు మండలానికి సంబంధించి గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికల్లో తమ్ముళ్లు చెప్పిన వారే అధ్యక్షులుగా ఎన్నికైన సట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు సంబంధించి కనీసం సొసైటీ సభ్యులకు సమాచారం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక సొసైటీలో ఉన్న సభ్యులు ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఆ ఏడుగురు డైరెక్టర్లు కలసి ఒక అధ్యక్షుడిని, ఒక ఉపాధ్యక్షుడిని ఎన్నుంటారు. వీరి పదవీ కాలం ఐదేళ్లపాటు ఉంటుంది. కేంద్రం, రాష్ట్రం నుంచి వచ్చే పథకాల అమల్లో వీరు ముఖ్య పాత్ర పోషిస్తారు. మండలంలో మొత్తం 14 సొసైటీలున్నాయి. వీటికి సంబంధించి నాలుగు విడతల్లో ఎన్నికలు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

ఏకపక్షంగా ఎన్నికలు..

మొదటి విడతగా మంగళవారం రంగంపేట, సిద్దరాంపురం, వడ్డుపల్లి, వేపచెర్ల గ్రామంలో షీప్ సొసైటీ ఎన్నికలు(గొర్రెల పెంపకందారుల సహకార సంఘం) నిర్వహించారు. సొసైటీ సభ్యులకు తప్పనిసరిగా ఎన్నికల సమాచారం ఇవ్వాలి. అయితే అధికారులు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించినట్లు సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు టీడీపీ నాయకులు చెప్పిన వారినే అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు వారు మండిపడుతున్నారు. సొసైటీ సభ్యుల వద్దనున్న మెంబర్ షిప్ పుస్తకాలను పోలీసులతో ఫోర్స్‌లు చేసి మరీ బలవంతంగా తీసుకున్నట్లు సమాచారం.

ఆత్మరక్షణ నైపుణ్యాలు అవసరం

ఆత్మకూరు: కిశోర బాలికలకు ఆత్మరక్షణ నైపుణ్యాలు అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో శక్తి కిశోరి వికాసంలో భాగంగా బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదం వచ్చినప్పుడు బాలికలు తమను తాము ఎలా రక్షించుకోవాలన్న విషయాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లీమారోజ్ తదితరులు పాల్గొన్నారు.

హంస రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా చాముండేశ్వరి

అనంతపురం మెడికల్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్(ఏపీ హంస) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు హంస రాష్ట్ర అధ్యక్షులు అరవపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈమె ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నారు. స్టాఫ్‌నర్సుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

వ్యాధి నిర్ధారణ కీలకం

అనంతపురం సెంట్రల్: సీజనల్, అంటువ్యాధుల నివారణలో వ్యాధి నిర్ధారణ కీలకమని పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో ఏడీ డాక్టర్ రామచంద్రతో కలిసి నియోజకవర్గ స్థాయి వెటర్నరీ ల్యాబ్స్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రయోగశాలలో జరుగుతున్న పరీక్షలు, తీస్తున్న నమూనాలు, వస్తున్న ఫలితాలను అడిగి తెలుసుకున్నారు.

దళిత సర్పంచులపై కూటమి ప్రభుత్వం వివక్ష

అనంతపురం రూరల్: దళిత సర్పంచులపై కూటమి ప్రభుత్వం, పంచాయతీ అధికారులు వివక్ష చూపుతున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. యాడికి సర్పంచ్ అనురాధను చిన్నచూపు చూస్తూ అభివృద్ధికి అడ్డపడుతున్న పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడుపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీపీఓ నాగరాజునాయుడుకు ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ యాడికి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డీపీఓను కోరారు. జేఏసీ నాయకులు బండి మహేష్, వెంకటేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మళ్లీ రీ సర్వే చేయించండి

రాప్తాడు: రీ సర్వేలో భూముల విస్తీర్ణం తగ్గిందని మళ్లీ రీ సర్వే చేయించాలని తహసీల్దార్ విజయకుమారిని గ్రామస్తులు కోరారు. మంగళవారం గంగలకుంట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వేలో రెవెన్యూ అధికారులు కొలతలు సరిగ్గా వేయలేదని, సర్వే నెంబర్ 80-1,2 లో దాదాపుగా ఎకరా 74 సెంట్ల భూమి తమకు తగ్గిందని పామాల్ల లక్ష్మీదేవి, కొండప్ప తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఎస్‌డీటీ జ్యోతి, సర్వేయర్ రామాంజినేయులు పాల్గొన్నారు.

చంద్రబాబుది రైతు వ్యతిరేక ప్రభుత్వం

అనంతపురం అగ్రికల్చర్: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు రైతులకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని ఏపీ రైతు సంఘం నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ కార్యాలయాల ఎదుట చేపట్టిన ధర్నాలో పండ్లతోటల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. డ్రిప్, స్ప్రింక్లర్లు 42 వేల హెక్టార్లకు పైగా టార్గెట్లు ఇచ్చినా అమలుకు వచ్చే సరికి కంటితుడుపుగా 5 వేల హెక్టార్ల వద్ద కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు తరిమెల నాగరాజు, ఎస్.మధుసూదన్, చెన్నారెడ్డి, రాజారాంరెడ్డి, బీహెచ్ రాయుడు, పోతులయ్య, చిదంబరమ్మ, నాగమ్మ, కె.శ్రీనివాసులు, వి.కొండారెడ్డి పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఆర్ఓ ఎ.మలోలను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఇతర నాయకులు కలిసి వినతి పత్రం అందజేసి సమస్యలు వివరించారు. సంఘం నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

రిత్విక గ్రూపు రజతోత్సవం



రజతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: రిత్విక బజాజ్ షోరూం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 44వ నంబరు జాతీయ రహదారి పక్కనున్న షోరూంలో మంగళవారం రజతోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్థకు సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ సీఎండీ శ్రీధర్‌రెడ్డి, జేఎండీ ప్రపూర్ణరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థను స్వర్ణోత్సవం వైపు నడిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎంపీఈఓలకు ఎంటీఎస్ వర్తింపజేయాలి

అనంతపురం సెంట్రల్: వ్యవసాయశాఖలో పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఎంపీఈఓలకు వెంటనే మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలని యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి రెడ్డిప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రైతుబజార్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలియజేశారు. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఏ వేమన, బాలకృష్ణ, పీడీఎస్‌యూ వీరేంద్ర, పీడీఎస్ఓ అశోక్, సంజీవరాజు, ఆర్‌వీ‌వీ వెంకటేష్, అశ్రఫ్‌వలి, సంతప్, శివ పాల్గొన్నారు.

ఘనంగా ఖాజాగరీబ్ నవాజ్ ఉరుసు

అనంతపురం కల్చరల్: ఇందిరానగర్‌లో ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఘనంగా మంగళవారం రాత్రి జరిగింది. బాజాభజంత్రీలు, రాజస్థానీ షేర్ డ్రమ్స్ హోరులో చాదర్‌ను పురవీధుల్లో ఊరేగించారు. నగర మేయర్ వసీం మాట్లాడుతూ ఏటా కులమతాలకతీతంగా ఉరుసు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్పొరేటర్ ఇసాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు దౌలా, దాదాఖలందర్, శీనా, భారతీ, తౌసిఫ్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతలో కడప దర్గా పీఠాధిపతి

అనంతపురం కల్చరల్: వైఎస్సార్ జిల్లా అమీన్ పీర్ దర్గా 11వ పీఠాధిపతి ఖ్వాజా సయ్యద్ షా అరిఫుల్లా మొహమ్మదుల్ హుసైనీ ఖాదిరి మంగళవారం అనంతకు విచ్చేశారు. స్థానిక కళ్యాణదుర్గంరోడ్డులోని స్వామి వారి శిష్యబృందమైన ఆషియా స్వగృహంలో భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, నార్పల సత్యనారాయణరెడ్డి, యువజన విభాగం నాయకులు సాకే హరి తదితరులు పీఠాధిపతులను కలిసి ఆశీర్వాదం అందుకున్నారు.

శాంతి సద్భావన రథయాత్ర జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్: ఈనెల 26న తలపెట్టిన మాతా జగదాంబ, సంత్ సేవాలాల్ మహారాజ్ శాంతి సద్భావన రథయాత్రను జయప్రదం చేద్దామని సంత్ సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్టు బంజారా సేవా సంఘ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబు నాయక్ కోరారు. మంగళవారం రాత్రి సంత్ సేవాలాల్ బంజారా కార్యాలయంలో శాంతి రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు.

అందుబాటులో - ఆరోగ్యాలయాలు మన అనంతపురంలో..

అధునాతన వైద్యం.. 'అనంత' సొంతం

• అందుబాటులో బైపాస్, న్యూరో సర్జరీలు



అనంతపురం మెడికల్: అనంతపురంలో వైద్య సేవల విస్తృతిలో పెద్ద మార్పు వచ్చింది. ఒకప్పుడు చిన్నపాటి ప్రమాదం జరిగితే పక్కన ఉన్న కర్నూలు, బెంగళూరుకు పరుగులు తీయాల్సి వచ్చేది. అటువంటిది ఐదేళ్లలో అనంతపురం రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీతో పాటు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్రంలోనే ఉండడం గమనార్హం. గుండె సమస్యలకు సంబంధించి బైపాస్ సర్జరీ, ఇతర శస్త్రచికిత్సలు, న్యూరో సర్జరీలు, కేన్సర్, ప్లాస్టిక్ సర్జరీ, తదితర వాటికి కేంద్రంగా అనంతపురం నిలుస్తోంది. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు అందుబాటులో ఉండడంతో రోగులు బెంగళూరు, హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం పొందుతున్నారు. వీటితో పాటు స్కాన్ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు అందుబాటులో ఉన్నాయి. రోగ నిర్ధారణకు సంబంధించి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో మొత్తం క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు, డయాగ్నస్టిక్ సెంటర్లు 374 ఉన్నాయి. వాటిలో జిల్లా కేంద్రంలోనే 60 శాతం ఉండడం గమనార్హం. జిల్లాలో 20 పడకల నర్సింగ్ హోంలు 80, అలాగే 50 పడకల నర్సింగ్ హోంలు 50, వంద పడకల నర్సింగ్ హోంలు 21 ఉన్నాయి. చిన్న డయాగ్నస్టిక్ సెంటర్లు 46, పెద్ద డయాగ్నస్టిక్ సెంటర్లు 13 ఉన్నాయి. వీటితో పాటు ఫెర్టిలిటీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇక బోధనాస్పత్రికి సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 7 రకాల స్పెషలిస్టు వైద్యం అందుబాటులో ఉంది. ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలాది మంది రోగులు సేవలు పొందుతున్నారు. బళ్లారి, కర్నూలు, కడప, తెలంగాణలాంటి ప్రాంతాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం అనంతపురం వస్తున్నారంటే వైద్య సేవలు ఏ స్థాయిలో విస్తరించాయో అర్థం చేసుకోవచ్చు.

అందుబాటులో ఆధునిక సేవలు



అనంతపురం 'సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గుండెకు సంబంధించి యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, ఇన్‌ట్రా వాస్క్యులర్ ఇమేజింగ్, ఫ్రాక్షనల్ ఫ్లో రిజర్వ్, తదితర అధునాతన శస్త్ర చికిత్సలు చేస్తారు. న్యూరో సర్జరీకు సంబంధించి పిట్యూటరీ ట్యూమర్ సర్జరీ(కోత లేకుండా ముక్కు ద్వారా సర్జరీ), స్పైనల్ డిస్క్ ప్రొల్యాప్స్‌ను మినిమలీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (చిన్న కోత) ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు అన్ని రకాల బ్రెయిన్, స్పైనల్ కార్డ్ ఆపరేషన్లను చేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సూపర్ స్పెషాలిటీలో కార్డియాక్, న్యూరో సర్జరీతో పాటు యూరాలజీ, కార్డియో థొరాసిక్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి.

జీజీహెచ్‌లో పాలియేటివ్ థెరపీ

ఏళ్ల తరబడి దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్న రోగులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పాలియేటివ్ థెరపీ ద్వారా వైద్యం అందిస్తున్నారు. కేవలం ప్రధాన నగరాల్లో మాత్రమే ఇటువంటి తరహా సేవలుండేవి. అటువంటిది జీజీహెచ్‌లో అనస్తీషియా వైద్యులు పాలియేటివ్ థెరపీను ఇస్తున్నారు. తెలంగాణా, కర్నూలు, కడప ప్రాంతాల రోగులు కూడా ఈ సేవలను పొందుతున్నారు.

వైద్య కళాశాల పట్ల ఆసక్తి

గతంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ సీట్లు ఉండే పరిస్థితి లేదు. ప్రస్తుతం పీజీ సీట్ల సంఖ్య 300కు చేరింది. ఏటా 122 మంది పీజీ విద్యార్థులు చేరుతున్నారు. దీంతో పాటుగా యూజీ సీట్లు 200 ఉన్నాయి. 23 విభాగాల్లో వైద్యులు సేవలందిస్తున్నారు. న్యూరో సర్జరీ ఎంసీహెచ్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఆలిండియా కోటాలోనూ అధిక సంఖ్యలో విద్యార్థులు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలోనే విద్యనభ్యసించాలని చూస్తుండడం విశేషం. రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలల్లో అనంతపురం బోధనాస్పత్రి ఉండడం గమనార్హం.